

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem STRUGGLE FOR JUSTICE TV

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 349 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 20, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



# కష్టాల కొలిమిలో.. కష్టజీవుల కన్నీరు !

## కొలిమి ఆరదు కష్టాలు తీరవు

పేదలు బ్రతికేదిలా పెరుగన్నం దొరికేదిలా
ధనవంతులకు రాజ్యాధికారం ధన సంపాదన కోసమేనా
పాలకులకు ప్రజలు ఉన్నారన్న సంగతి గుర్తుందా..
మణిపూర్ మంటల్లో కాలుతుంది
పశ్చిమ బెంగాల్ బగబగ మండుతుంది
కటిక చీకటిలో దేశ రాజధాని ఢిల్లీ
ఆంధ్రప్రదేశ్ అల్లకల్లోలం దాడులతో దౌర్జన్యం సృష్టిస్తున్నారు
ప్రజల కన్నీళ్లు ప్రభుత్వాలకు నవ్వులాటలుగా ఉన్నాయి
పాలకుల తీరుతో ప్రజలకు కష్టాలు పెరిగిపోతున్నాయి
డాక్టర్ బరిగెల శివ

దేశంలో పేదరికం రోజురోజుకూ పెరుగుతుండగా కష్టజీవుల బతుకులు కన్నీటి కొలిమిలో కాలిపోతున్నాయని డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు కనీస జీవన సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు సంపన్నుల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని విమర్శించారు. మణిపూర్‌లో అల్లర్లు, పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు, ఢిల్లీలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులు ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పాలకుల ప్రాధాన్యతల్లో ప్రజా సంక్షేమం వెనుకబడిపోవడంతో పేదల బతుకులు భారంగా మారుతున్నాయని అన్నారు. ప్రజల కన్నీళ్లు తుడవలేని పాలకులకు అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని డాక్టర్ బరిగెల శివ వ్యాఖ్యానించారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## ఏపీలో 5 ఎంపీపీ స్థానాల్లో లాటరీ... టీడీపీకి 4, వైసీపీకి 1

గుర్ల ఎంపీపీగా లాటరీ ద్వారా గెలిచిన టీడీపీ అభ్యర్థి సన్యాసినాయుడు
బలాబలాలు సమానం కావడంతో 5 మండలాల్లో లక్కీ డ్రా
లాటరీలో 4 ఎంపీపీ స్థానాలు దక్కించుకున్న టీడీపీ
మునగపాక మండలంలో లక్కీ డ్రాతో గెలిచిన వైసీపీ




4



## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి: సీఎం రేవంత్ రెడ్డి

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ లక్ష్యం
85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సు ప్రారంభం

5



## ఫిబ్రవరి 24 నుంచి ఇంటర్ పరీక్షలు

తెలంగాణ ఇంటర్ వార్షిక పరీక్షల తాత్కాలిక షెడ్యూల్ విడుదల
మార్చి 20 వరకు కొనసాగనున్న థియరీ పరీక్షలు
ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు
జనవరి 20 నుంచి ఇంటర్నల్ అసెస్‌మెంట్, ప్రాక్టికల్స్
జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షల నిర్వహణ

2

## మెడికల్ షాపులపై కొరడా

**హైదరాబాద్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్) :**

రాష్ట్రంలో మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, యాంటీబయాటిక్స్ విచ్చలవిడి అమ్మకాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టీజీ సేఫ్ డ్రగ్స్ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, పంజాగుట్ట, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో మెడికల్ షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. సుమారు 90 దుకాణాల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. ట్రామడాల్, అల్ప్రాజోలం, కోడైన్ సిరప్ వంటి మత్తు కలిగించే మందుల విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా, ఉల్లంఘనల తీవ్రతను బట్టి లైసెన్సుల సస్పెన్షన్ లేదా రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు. మరోవైపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రబొర్రు గ్రామంలో అర్హత లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్న షేక్ మస్తాన్ వలీపై అధికారులు దాడి చేశారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, నొప్పి నివారణ మందులు సహా 34 రకాల, సుమారు రూ.42 వేల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వినియోగించడం ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. యాంటీబయాటిక్స్ విచ్చలవిడి వాడకంతో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరుగుతుందని, స్టెరాయిడ్ల దుర్వినియోగం రోగనిరోధక శక్తిని తగ్గించి ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని స్పష్టం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
సమస్యలపై సమరంగా
POWER OF PEOPLE
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు జేఎన్ఎస్ స్టేడియం సిద్ధం చేయాలి

### అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలి
### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ, 19 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

డిసెంబర్ 18 నుంచి 24 వరకు నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 అథ్లెటిక్స్ పోటీలకు జేఎన్ఎస్ స్టేడియాన్ని సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్నతో కలిసి హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి, అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి, ఇంజనీరింగ్ తదితర పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలో చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడంతోపాటు నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# కెంబతల్లి సర్వే నెం.55 నివాసితుల ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు నగరంలోని కెంబతల్లి సర్వే నెం. 55లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని కర్ణాటక జనందోళన సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సి. సిద్దలింగప్ప, కర్ణాటక సామరస్య కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నాల్లి కృష్ణప్ప నేతృత్వంలో బెంగళూరు సిటీ జిల్లా కలెక్టర్, జీబీఏ దక్షిణ మున్సిపల్ కమిషనర్‌లకు విజ్ఞప్తి చేశారు. తక్షణ చర్యలు తీసుకోవాలని వారిని కోరారు. ఈ సందర్భంగా కన్నాల్లి కృష్ణప్ప మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచినా పేదలు ప్రజలకు ఇప్పటికీ ప్రాథమిక సౌకర్యాలను నోచుకోలేదని అన్నారు. కెంబతల్లి సర్వే నెం. 55లో వందలాది మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరిలో ఎస్.సి/ఎస్టీ, మైనారిటీ వర్గాల వారు ఉన్నారు. మంచి రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సౌకర్యాలను ప్రభుత్వం వారికి కల్పించలేదు. కెంబతల్లిలో చెత్తను పారవేయడం వల్ల దుర్వాసన, ఇక్కడ నివసిస్తున్న ప్రజలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, పర్యావరణం కలుషితమవుతోందని ఆయన అన్నారు. జీబీఏ దక్షిణ కార్పొరేషన్ ఎలాంటి చర్య తీసుకోలేదు. వారు తక్షణమే చర్యలు తీసుకుని, కనీస సౌకర్యాలు కల్పించి, చెత్త సమస్యను పరిష్కరించాలి అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు తబసుమ్, శకుంతలమ్మ, గంగన్న, అన్నమ్మ, జయంతి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీలో 5 ఎంపీపీ స్థానాల్లో లాటరీ... టీడీపీకి 4, వైసీపీకి 1

**విజయవాడ, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్) :**

విజయనగరం జిల్లా గుర్ల మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఎన్నిక తీవ్ర ఉత్కంఠ నడుమ ముగిసింది. గుర్ల ఎంపీపీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సన్యాసినాయుడిని అదృష్టం వరించింది. ఇరు పార్టీల సభ్యుల బలం సమానం కావడంతో అధికారులు నిర్వహించిన లక్కీ డ్రాలో సన్యాసినాయుడు విజయం సాధించి గుర్ల ఎంపీపీ పీఠాన్ని దక్కించుకున్నారు. నవంబరు 19 ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో గుర్లతో పాటు మొత్తం ఐదు మండలాల్లో టీడీపీ, వైసీపీల బలాబలాలు సమానంగా నిలిచాయి. ఎన్నికల్లో టై ఏర్పడటంతో ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారులు లాటరీ (లక్కీ డ్రా) నిర్వహించి విజేతలను నిర్ణయించారు. ఈ ఐదు స్థానాల్లో టీడీపీ అత్యధికంగా నాలుగు స్థానాలను గెలుచుకోగా, వైసీపీ ఒక స్థానాన్ని దక్కించుకుంది. గుర్ల మండలంలో టీడీపీ తరఫున బరిలో నిలిచిన సన్యాసినాయుడు లాటరీ ద్వారా గెలుపొందగా, మిగిలిన మండలాల్లోనూ ఫలితాలు ఆసక్తికరంగా మారాయి. నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో టీడీపీ అభ్యర్థి పొట్టేళ్ల పార్వతి లక్కీ డ్రాలో విజయం సాధించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఓబులదేవర చెరువు మండలంలో పిట్టా ఓబులరెడ్డి (టీడీపీ), కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో సుజిత (టీడీపీ) లాటరీ ద్వారా ఎంపీపీ పీఠాలను కైవసం చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండలంలో మాత్రం ఫలితం వైసీపీకి అనుకూలంగా వచ్చింది. అక్కడ నిర్వహించిన లక్కీ డ్రాలో వైసీపీ అభ్యర్థి మొల్లేటి శంకర్ విజేతగా నిలిచి ఎంపీపీ పదవిని దక్కించుకున్నారు. టై అయిన ఐదు మండలాల్లో లక్కీ డ్రా ప్రక్రియను ఎన్నికల అధికారులు పూర్తి పారదర్శకంగా నిర్వహించి ఫలితాలను అధికారికంగా వెల్లడించారు.

# కష్టాల కొలిమిలో కష్టజీవుల కన్నీరు





**కొలిమి ఆరదు కష్టాలు తీరవు**
**పేదలు బ్రతికేదిలా పెరుగన్నం దొరికేదిలా.**
**ధనవంతులకు రాజ్యాధికారం ధన సంపాదన కోసమేనా.**
**పాలకులకు ప్రజలు ఉన్నారన్న సంగతి గుర్తుందా.....**
**మణిపూర్ మంటల్లో కాలుతుంది.**
**పశ్చిమ బెంగాల్ బగబగ మండుతుంది.**
**కటిక చీకటిలో దేశ రాజధాని ఢిల్లీ**
**ఆంధ్రప్రదేశ్ అల్లకల్లోలం దాడులతో దౌర్జన్యం సృష్టిస్తున్నారు**
**ప్రజల కన్నీళ్లు ప్రభుత్వాలకు నవ్వులాటలుగా ఉన్నాయి.**
**పాలకుల తీరుతో ప్రజలకు కష్టాలు పెరిగిపోతున్నాయి.**
**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

దేశంలో పేదరికం పెరిగిపోతుందని డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల కన్నీరును తూడ్చాల్సిన ప్రభుత్వాలు పేద ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు ఎంతటి కష్టాలను అనుభవిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు ప్రజలను ఆదుకోలేకపోతున్నారని బాధ వ్యక్తం చేశారు. 2014 ముందు అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారతదేశం ఎంతో ఉన్నతమైన స్థానంలో ఉండేదని అభివృద్ధి పరంగా ఆర్థికపరంగా ముందున్న భారతదేశం ఒక్కసారిగా వెనుకబడిపోవడంతో పాటు ఎంతో భారమైన అప్పులను అనుభవిస్తుందని అందువలనే పేదలు కడుపేదలుగా మారిపోతూ ధనికులు అత్యంత ధనికులుగా ఎదుగుతున్నారని గుర్తు చేశారు. పేదలు కష్టపడి పని చేసుకోవడానికి కూడా కూలీనాలీ పనులు దొరకడం లేదని అదే ధనికులకు బ్యాంకులలో వేల కోట్ల రూపాయల రుణాలు సునాయాసంగా లభించబడుతూ అంతే సునాయాసంగా వాటిని మాఫీ చేసుకోవడానికి వెసులుబాటులో దొరుకుతున్నాయని వాటన్నిటిని దేశ ప్రజలు దేశం మేడావులు లోతైన స్థాయిలో పరిశీలించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం గాని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు గాని పేద ప్రజలకు అందాల్సిన కనీస నిత్యవసరాల సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో విఫలమవుతున్నారని అసలు కైతే ప్రభుత్వాలు ఏర్పడినదే పేద ప్రజల సంక్షేమాల కొరకన్నది మర్చిపోవచ్చు ప్రభుత్వాలను పాలిస్తుండడం విచారకరమన్నారు. పేద ప్రజల మీద కనీసం ప్రేమ ఉన్న నాయకులు పేద ప్రజల బ్రతుకులకు వెలుగును నింపే ప్రయత్నం చేస్తున్నారని తెలియజేశారు. కష్టకాలంలో ప్రజలను ఆదుకోవడానికి దాతలు కరువైపోతున్నారని రాజకీయ నాయకుల ధ్యాస ప్రజాప్రతినిధుల ధ్యాస ప్రభుత్వ అధికారుల ధ్యాస వ్యాపారాలపై ఆస్తుల సంపాదనపై ఎక్కువగా పెరిగిపోతుందని అలాంటప్పుడు పేద ప్రజలకు సహాయపడాలనే ఆలోచన ఏ విధంగా లభిస్తుందంటూ సూటిగా ప్రశ్నించారు. రాజకీయ నాయకులు పదవులను పైసలతో కొనుగోలు చేసుకుంటూ అధికారాన్ని సాంకేతికంగా రాబట్టుకుంటూ ప్రజా జీవితాలను మోసం చేస్తున్నారని తెలియజేశారు. అధికారులు ప్రభుత్వాలు చెల్లించే లక్షలాది జీతాలతో సంతృప్తి పడకుండా అదనంగా అడ్డదారిలో వచ్చే సొమ్ము కోసం ఎంత తీవ్రమైన ఆరాటపడుతున్నారో దేశంలో జరుగుతున్న ప్రభుత్వ కార్యాలయాల్లోని లక్షలాది సంఘటనలు గుర్తుచేస్తున్నాయన్నారు. దేశంలో ఎక్కడ చూసినా బస్టాండ్లలో రైల్వేస్టేషన్లో దేవాలయాలలో రోడ్లపై ప్రధాన ప్రాంతాలలో భిక్షాటనతో జీవితాలు గడిపే కుటుంబాలు కోట్లల్లో ఉన్నాయంటే నమ్మశక్యం కాని విషయం అన్నారు. ప్రభుత్వాలు పేద ప్రజలను మోసగించడానికి శక్తి వంచన లేని కృషి చేస్తున్నట్లుగా దేశ పాలన పలు రాష్ట్రాల్లోని పాలన స్పష్టం చేస్తుండగా ప్రతి రాజకీయ నాయకుడు దేశంలోని పేద ప్రజలను మాత్రమే మోసగించడానికి ఎన్ని రకాల మోసపూరిత మాటలను అబద్దాలతో కూడిన మాటలను మాట్లాడుతున్నారో దేశవ్యాప్తంగా నడుస్తున్న సోషల్ మీడియా సైతం కన్నీరు పెడుతుందన్నారు. పైగా పేదవాళ్లు చెల్లించాల్సిన సాదాసీదా ప్రభుత్వ పన్నులకుగాను లెక్కలేనంత వడ్డీలను కలుపుతూ ప్రజలు బెంబెత్తిపోయే విధంగా విసిగిపోయే విధంగా చేస్తున్నారని అలాంటి సందర్భాల్లోనే దౌర్జన్యాలకు పాల్పడుతూ దాడులకు పాల్పడుతూ, బెదిరింపులకు పాల్పడుతూ పేద ప్రజలు చెల్లించాల్సిన పన్నులను బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని అలాంటి దౌర్జన్యాలను ధనికులపై రాజకీయ నాయకులపై అధికారులపై చేయడానికి మాత్రం ప్రభుత్వాలకు కనీసపు ఆసక్తి లేకుండా పోతుందని విమర్శించారు. ఉదయం లేచినది మొదలుకొని కన్నీటి బాధతో దినచర్యను ప్రారంభిస్తున్న పేదవాడు సాయంత్రం వరకు అదే కన్నీటిని అంటిపెట్టుకొని జీవిస్తున్నారని అన్నారు.

**కొలిమిలో కాలుతున్న ప్రజా సమస్యలు.....**

మణిపూర్ రాష్ట్రంలోని ప్రజల సమస్యలు మంటల్లో కాల్చబడుతున్నాయని నాలుగు సంవత్సరాలుగా మణిపూర్ రాష్ట్రం రగులుతూనే ఉందని తెలుపుతూ భారతదేశంలోని రాష్ట్రమైన మణిపూర్ పై ఆ రాష్ట్ర ప్రభుత్వమైన బిజెపికి ఏమాత్రం చిత్తశుద్ధి లేకపోగా ప్రజలు మంటల్లో కాలిపోవడం ప్రజల సమస్యలు కొలిమిలో కాలిపోవడం ప్రజల బ్రతుకులు బుగ్గి పాలు కావడం కేంద్ర ప్రభుత్వానికి,మణిపూర్ ప్రభుత్వానికి చాలా ఆనందంగా ఉన్నట్లుగా ఉందన్నారు. ముఖ్యంగా రెండు క్రైస్తవ తెగల మధ్య జరుగుతున్న అల్లర్లను ఆ రాష్ట్ర ప్రభుత్వమే రెచ్చగొట్టి నేటికీ నాలుగు సంవత్సరాలు గడుస్తున్న సమస్యను పరిష్కరించకుండా ఎంతటి ఘోరమైన పాలనను కొనసాగిస్తున్నారో దేశ ప్రజలందరూ ద్వేషిస్తున్నారన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో అడ్డదారిలో గెలిచిన బిజెపి ప్రభుత్వం వేలాదిమంది ముస్లిం నివాసాలను బుల్డోజర్ల సహాయంతో కూల్చివేసి తమ కక్ష సాధింపు చర్యలను తీర్చుకుందని టైలర్ కుటుంబాలను వాళ్ళ ఇల్లు మంటల్లో కాల్చివేసారని అంతేకాకుండా మసీదులను క్రైస్తవ ఆలయాలను కూల్చివేసి ప్రజలను విపరీతమైన దాడులకు గురి చేశారని తీవ్రంగా మండిపడ్డారు. బీహార్ ఉత్తరప్రదేశ్ గుజరాత్ మధ్యప్రదేశ్ చత్తీస్గడ్ లాంటి రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు అనుకూలమైన రాజకీయ పార్టీలకు ప్రజలకు నాయకులకు మినహాయిస్తే ఇతర ప్రజలు ఇతర మతస్థులు ఆయా రాష్ట్రాల్లో జీవించడానికి వీలులేదనే విధంగా రాజరికపు అధికార హుకుం జారీ చేయబడిందని ఐదేళ్లుగా ఆయా రాష్ట్రాల్లో ప్రజల బ్రతుకులు కష్టాల కొలిమిలో కాలిపోతున్నాయని తీవ్రంగా మదనపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు సంవత్సరాలుగా రాష్ట్ర పాలన దేశంలోని బిజెపి పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల కన్నా మరింత దారుణమైన సంఘటనలు చోటు చేసుకున్నాయని హెచ్చరించారు. అసలు కైతే ప్రభుత్వం ఏర్పడినదే కక్ష సాధింపులను నెరవేర్చుకోవడానికేది స్పష్టంగా అర్థమయిపోతుందన్నారు. దేశవ్యాప్తంగా క్రిమినల్ సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేసిన రాష్ట్రాలలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానానికి చేరిపోవడం కూడా అందులో భాగమేనన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే క్రిమినల్ కేసులు మహిళలపై దాడుల కేసులు దొంగతనాలు హత్య కేసులు విపరీతంగా పెరిగిపోయినాయని వాటి వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాష్ట్రంలో జీవించలేకుండా బయట రాష్ట్రాలకు వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికీ తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన ప్రజలు కోటికి పైగా జీవిస్తున్నారంటే అది తెలంగాణ గొప్పతనం ఉన్నారు. ఏ రాష్ట్రంలోనైతే ప్రభుత్వాలు ప్రజలను కష్టాల్లోనికి నెట్టేసి ప్రజా సమస్యలను మంటల్లో కాల్చబడేలా చేస్తారో ఆయా రాష్ట్ర ప్రజల పరిస్థితి దారుణంగా మారిపోయి కొలిమిలో కాలుతున్న కష్టాలను వాళ్ల కన్నీళ్ళతో ఆర్పుకునే పరిస్థితి వరకు చేరిపోయెలా చేస్తుందనిచెప్పాల్సి వస్తుందన్నారు. సాధరణ ప్రజలను మాత్రమే కష్టాల పాలు చేసే ప్రభుత్వాలకు ప్రజలను పాలించే హక్కులు లేవని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రపంచమంతా ఒక్కసారిగా ఢిల్లీ వైపు చూస్తుందని ఢిల్లీలో జరుగుతున్న మరణకాండ ప్రభుత్వ కుట్రేనని కేంద్ర ప్రభుత్వంపై జరుగుతున్న ప్రజాస్వామ్య రక్షణ పోరాటాన్ని ఎంత క్రూరంగా అణిచివేస్తున్నారో ఎన్ని వేలమంది కేంద్ర బలగాలను మొహరింపజేస్తూ దాడులు చేయిస్తున్నారో వాటిని గమనిస్తున్న ప్రజాస్వామ్యవాదులు వాటిని తీవ్రంగావ్యతిరేకించాలన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రజల కష్టాలను పట్టించుకోకుండా ప్రజల జీవితాలను బాగుపరచకుండా ప్రజలను కంటతడి పెట్టిస్తూ రాజ్యాధికారాలను అనుభవిస్తున్న ప్రభుత్వాలు గత్యంతర లేకుండా కూలిపోవడం తప్పదంటూ హెచ్చరించారు.

# ఫిబ్రవరి 24 నుంచి ఇంటర్ పరీక్షలు

**తెలంగాణ ఇంటర్ వార్షిక పరీక్షల తాత్కాలిక షెడ్యూల్ విడుదల**
**మార్చి 20 వరకు కొనసాగనున్న థియరీ పరీక్షలు**
**ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు**
**జనవరి 20 నుంచి ఇంటర్నల్ అసెస్‌మెంట్, ప్రాక్టికల్స్**
**జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షల నిర్వహణ**

**హైదరాబాద్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధించి తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి (టీజీబీఐఈ) తాత్కాలిక షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2027లో జరగనున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరాల జనరల్, ఒకేషనల్ పరీక్షల తేదీలను బోర్డు కార్యదర్శి కె.ఆర్. అభిలాష్ అభినవ్ వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం థియరీ పరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి మార్చి 20 వరకు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. థియరీ పరీక్షలకు ముందుగా ప్రాక్టికల్ పరీక్షలు పూర్తి చేయనున్నారు. జనవరి 20 నుంచి 25 వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్నల్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తారు. జనవరి 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పర్యావరణ విద్య పరీక్ష, జనవరి 29న అదే సమయానికి ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష జరగనున్నాయి. జనవరి 29న ప్రథమ సంవత్సరం, జనవరి 30న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఆదివారాలతో సహా రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ జరుగుతాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 11 నుంచి 18 వరకు ప్రథమ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు కొత్త విధానంలో మూడు సెషన్లలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. ప్రథమ సంవత్సరం థియరీ పరీక్షలు ఫిబ్రవరి 24న సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1తో ప్రారంభమై, ఫిబ్రవరి 26న ఇంగ్లీష్ పేపర్-1, మార్చి 2న మ్యాథమెటిక్స్ పేపర్-1ఏ, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1, అకౌంటెన్సీ పేపర్-1 (ఏసీఈ గ్రూప్), మార్చి 5న మ్యాథమెటిక్స్ పేపర్-1బీ, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్-1, కామర్స్ పేపర్-1 (ఏసీఈ గ్రూప్), మార్చి 9న ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1, మార్చి 15న కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ అండ్ అకౌంటెన్సీ పేపర్-1, మార్చి 17న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, మ్యాథమెటిక్స్ పేపర్-1 (ఎంఈసీ గ్రూప్), మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1, జియోగ్రఫీ పేపర్-1, మార్చి 19న బైపీసీ విద్యార్థుల బ్రిడ్జ్ కోర్స్ మ్యాథమెటిక్స్ పేపర్-1 నిర్వహిస్తారు. ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలు ఫిబ్రవరి 25న సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2తో ప్రారంభమై, ఫిబ్రవరి 27న ఇంగ్లీష్ పేపర్-2, మార్చి 3న మ్యాథమెటిక్స్ పేపర్-2ఏ, బోటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్-2, మార్చి 8న మ్యాథమెటిక్స్ పేపర్-2బీ, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్-2, మార్చి 12న ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2, మార్చి 16న కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ అండ్ అకౌంటెన్సీ పేపర్-2, మార్చి 18న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2, జియోగ్రఫీ పేపర్-2, మార్చి 20న బైపీసీ విద్యార్థుల బ్రిడ్జ్ కోర్స్ మ్యాథమెటిక్స్ పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఒకేషనల్ విద్యార్థులకు కూడా పేర్కొన్న తేదీల్లోనే ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. అయితే ఒకేషనల్ కోర్సుల థియరీ పరీక్షల సబ్జెక్టుల వారీ షెడ్యూల్‌ను త్వరలో ప్రత్యేకంగా విడుదల చేయనున్నారు. ప్రస్తుతం ప్రకటించినది తాత్కాలిక షెడ్యూల్ మాత్రమేనని, పూర్తి వివరాలతో కూడిన సమగ్ర టైమ్‌టేబుల్ బోర్డు అధికారిక పోర్టల్‌లో అందుబాటులో ఉంటుందని కార్యదర్శి తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయిలో కాకతీయ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి ప్రతిభ

**అమెరికాలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా కొనసాగుతున్న డాక్టర్ గోసుకొండ సంజయ్ రెడ్డి..**
**స్వగ్రామంలా భావించే విద్యాసంస్థకు సందర్శన**

**కేయూ క్యాంపస్, 19 నవంబర్ (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు చెందిన 1983--87 బ్యాచ్ బి.ఫార్మసీ పూర్వ విద్యార్థి, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ శాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన డాక్టర్ గోసుకొండ సంజయ్ రెడ్డి తన పూర్వ విద్యాసంస్థను సందర్శించారు. ప్రస్తుతం అమెరికాలోని కాలిఫోర్నియాలో వివాస్ కంపెనీలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న ఆయన రాకతో కళాశాలలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. కృష్ణవేణి ఆధ్వర్యంలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఘన స్వాగతం పలికి శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. కృష్ణవేణి మాట్లాడుతూ, కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి, ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ శాస్త్రవేత్తగా ఎదిగిన డాక్టర్ సంజయ్ రెడ్డి కళాశాలను సందర్శించడం గర్వకారణమన్నారు. ఒక విద్యాసంస్థకు అక్కడ చదువుకున్న విద్యార్థులు సాధించే విజయాలే నిజమైన గుర్తింపు అని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకోవడం వల్ల వారిలో ఉన్నత లక్ష్యాలను సాధించాలనే సంకల్పం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు.ప్రస్తుత ఫార్మసీ విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పరిశోధన, నూతన ఔషధ ఆవిష్కరణలు, ఆధునిక విశ్లేషణాత్మక పద్ధతులు, ఔషధ పరిశ్రమలో వస్తున్న సాంకేతిక మార్పులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఫార్మసీ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని అన్నారు.అనంతరం డాక్టర్ గోసుకొండ సంజయ్ రెడ్డి మాట్లాడుతూ, 1983--87 మధ్య కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ చదువుకున్న రోజులు తన జీవితంలో మరపురాని జ్ఞాపకాలుగా నిలిచిపోయాయని గుర్తుచేసుకున్నారు. అనంతరం ఉన్నత విద్య కోసం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్‌లో ఎం.ఎస్., పీహెచ్‌డీతో పాటు పోస్ట్‌డాక్టోరల్ ఫెలోషిప్ పూర్తి చేసినట్లు వివరించారు. ప్రస్తుతం కాలిఫోర్నియాలోని వివాస్ కంపెనీలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తన విద్యా, పరిశోధనా ప్రస్థానంలో కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల అందించిన విద్య, అధ్యాపకుల బోధన, మార్గదర్శకత్వం, క్రమశిక్షణ కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. విద్యార్థి దశలో నేర్చుకున్న అంశాలు, అధ్యాపకులు అందించిన ప్రోత్సాహం అంతర్జాతీయ స్థాయిలో ఎదగడానికి బలమైన పునాదిగా నిలిచాయని తెలిపారు. ఎన్నో సంవత్సరాల తర్వాత తాను చదువుకున్న కళాశాలను సందర్శించి, పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు.ప్రస్తుత విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఎం.ఫార్మసీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యతో పాటు ఆధునిక పరిశోధనా పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ పరిశోధనా ప్రమాణాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కష్టపడి పనిచేయడం, పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర అభ్యాసం విజయానికి ముఖ్యమైన మార్గాలని పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఫార్మసీ రంగంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.తాను విద్యనభ్యసించిన కళాశాలను సందర్శించే అవకాశం కల్పించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. కృష్ణవేణి, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల విద్యా ప్రమాణాలు, పరిశోధనా కార్యక్రమాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. కృష్ణవేణి, ప్రొఫెసర్ సమ్మయ్య, ప్రొఫెసర్ నాగరాజు, డాక్టర్ షాహిదా తదితర అధ్యాపకులు డాక్టర్ సంజయ్ రెడ్డిని శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐఎంఏ రాష్ట్ర ఉత్తమ శాఖ అధ్యక్షుడిగా డా. కాదా వెంకటరమణ ఎంపిక



**కాకినాడ, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక పురస్కారాలు--2026లో పెద్ద శాఖల విభాగంలో ఉత్తమ శాఖ అధ్యక్షుడిగా ఐఎంఏ కాకినాడ శాఖ అధ్యక్షుడు డా. కాదా వెంకటరమణ ఎంపికయ్యారు. వైద్య వృత్తి అభ్యున్నతికి, శాఖ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు, సమాజ సేవకు ఆయన అందించిన విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించనుంది. ఐఎంఏ కాకినాడ శాఖ అధ్యక్షుడిగా డా. కాదా వెంకటరమణ నాయకత్వంలో చేపట్టిన కార్యక్రమాలు, వైద్యుల సంక్షేమం, వైద్య రంగ అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చూపిన చొరవకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల శాఖ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ కాకినాడ శాఖ కార్యదర్శి డా. ఎస్.సీ.హెచ్.ఎస్. రామకృష్ణ శాఖ సభ్యుల తరఫున డా. కాదా వెంకటరమణకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ పురస్కారం కాకినాడ శాఖ సభ్యులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. తుఫాను కారణంగా వాయిదా పడిన ఐఎంఏ రాష్ట్ర మహాసభలు ఏపీకాన్--2026 నవంబర్ 27, 28, 29 తేదీల్లో అమలాపురంలో నిర్వహించనున్నట్లు ఐఎంఏ రాష్ట్ర గౌరవ ప్రధాన కార్యదర్శి డా. ఎం.ఎస్.ని. బోస్ వెల్లడించారు. ఈ మహాసభల్లో రాష్ట్ర వార్షిక పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. పురస్కార ప్రదాన కార్యక్రమానికి సంబంధించిన సవరించిన తేదీ, సమయాన్ని నిర్వాహకులు ధ్రువీకరించిన అనంతరం అధికారికంగా ప్రకటించనున్నారు. రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికైన డా. కాదా వెంకటరమణకు వైద్య రంగ ప్రముఖులు, ఐఎంఏ సభ్యులు, పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

## ఛలో సిద్దిపేట.. సీఎం సభకు పరకాల కాంగ్రెస్ శ్రేణుల పయనం



**పరకాల, 19 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభకు పరకాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య ఆదేశాల మేరకు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను ఆధ్వర్యంలో నాయకులు సిద్దిపేటకు పయనమయ్యారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లం రఘు, బొచ్చు భాస్కర్, సిలువేరు రాఘవ, వెంకటేష్, దొమ్మటి ప్రభాకర్, బొచ్చు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా గాంధీ ఆశయాల సాధనకు పునరంకితం కావాలి

**నల్లబెల్లిలో మాజీ ప్రధాని జయంతి వేడుకలు..**
**ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు**



**నల్లబెల్లి, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

భారత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి వేడుకలను నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మలోత్ చరణ్ సింగ్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభ్యున్నతి, ఐక్యత, సమగ్రత పరిరక్షణకు ఇందిరా గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా కుల, మత, భాష, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ బలమని, ప్రజాస్వామ్య విలువలు, సమానత్వం, సోదరభావాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, పీఏసీఎస్ డైరెక్టర్ చార్ల శివారెడ్డి, మామిండ్ల రాజిరెడ్డి, బత్తిని మల్లయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఇస్తారి శేఖర్, సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు, సిద్ధ సంతోష్, మాలోత్ రామ్ లాల్, కోలిపాక రఘుపతి, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బోళ్ల సర్వేశం, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గంధం కుమార్, మాజీ సర్పంచులు నానబోయిన రాజారామ్, పుల్ సింగ్, మండల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో కాకతీయ ఆర్ట్స్ కళాశాలకు 23వ ర్యాంక్

**తెలంగాణలో మూడో స్థానం.. శతాబ్ది ఉత్సవాల వేళ మరో ఘనత**



**హన్మకొండ, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ స్థాయిలో మరో ఘనత సాధించింది. ఎడ్యుకేషన్ వరల్డ్ ప్రకటించిన 'జుజె ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ 2026--27'లో దేశవ్యాప్తంగా 23వ ర్యాంకు, తెలంగాణలో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 700 పాయింట్లకు 462 స్కోరు సాధించింది.గత నాలుగేళ్లుగా జాతీయ ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్న కళాశాల, 2023, 2024లో 23వ ర్యాంకు, 2025లో 25వ ర్యాంకు సాధించగా, ఈ ఏడాది తిరిగి 23వ స్థానానికి చేరుకుంది. నాయకత్వం, పాలన నాణ్యతలో 73, మౌలిక సదుపాయాల్లో 71 పాయింట్లు సాధించింది.వందేళ్ల చరిత్ర కలిగిన ఈ కళాశాలలో భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు వంటి ప్రముఖులు విద్యనభ్యసించడం విశేషం. ఈ విజయంపై ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, ఓఎస్డీ ప్రొఫెసర్ బి. వెంకట్రామ్ రెడ్డి తదితరులు కళాశాల సిబ్బందిని అభినందించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి మాట్లాడుతూ, ఈ విజయం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థుల సమష్టి కృషి ఫలితమని తెలిపారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా లభించిన గుర్తింపుతో మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ప్లేస్‌మెంట్లకు ప్రాధాన్యతనిస్తూ కళాశాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

## రూ.10,600 జరిమానా

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.1,000 జరిమానా

**వరంగల్, నవంబర్ 19(జై భీమ్ న్యూస్)**

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 15 మందిని గురువారం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. ××× స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ×× క్లాస్ కోర్టు, వరంగల్ న్యాయమూర్తి శ్రీ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరుపరచగా, 15 మందికి కలిపి రూ.10,600 జరిమానా విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరు వాహనదారులకు రూ.1,000 జరిమానా విధించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి ఐపీఎస్, అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టీ. సత్యనారాయణ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. ఈ వివరాలను వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత వెల్లడించారు.

## కాళోజీ కళాక్షేత్రానికి కుడా కార్యాలయం తరలింపు

**నూతన కార్యాలయాన్ని సందర్శించిన కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హన్మకొండ, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయాన్ని బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం రెండవ, మూడవ అంతస్తులకు తరలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ ఛైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయి సందర్శించారు. కార్యాలయ తరలింపు అనంతరం కుడాలోని వివిధ విభాగాల వారీగా చేపట్టిన ఏర్పాట్లను వారు పరిశీలించారు. కార్యాలయంలోని ఆయా విభాగాలను సందర్శించి, నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇకపై కాళోజీ కళాక్షేత్రంలోని కుడా కార్యాలయం నుంచి అధికారులు తమ విధులను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్‌రావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కేయూ లో రూ.6.90 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**మహిళా హాస్టళ్లకు ప్రహరీ గోడ,**
**ఇంజినీరింగ్ కళాశాలకు మూడు వర్క్‌షాప్ షెడ్లు**

**కేయూ క్యాంపస్, 19 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో రూ.6.90 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మహిళా హాస్టళ్లైన పద్మాక్షి, సావిత్రిబాయి ఫూలే, ట్రైబల్ హాస్టళ్లతో పాటు ఇతర కేటాయించిన వసతుల చుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రహరీ గోడ నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.3.15 కోట్లు కేటాయించినట్లు డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆచార్య వై. వెంకయ్య తెలిపారు.అదేవిధంగా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం మూడు వర్క్‌షాప్ షెడ్ల నిర్మాణానికి రూ.3.75 కోట్లు వెచ్చించనున్నారు. ఈ పనులను ఆరు నెలల్లో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ ఎన్. సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, కె. అనితా రెడ్డి, పలువురు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

## డిజిటల్ బోధనతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి: జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి



**నర్సంపేట, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

ప్రస్తుత విద్యా విధానంలో డిజిటల్ బోధన ఎంతో ఆవశ్యకమని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గది బోధనలో సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించి నాణ్యమైన విద్య అందించవచ్చని వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గణితం, భౌతిక శాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నర్సంపేటలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, డిజిటల్ అభ్యసన వనరులను ఉపయోగించి గణిత, భౌతిక శాస్త్ర అంశాలను విద్యార్థులకు మరింత సులభంగా, ఆసక్తికరంగా బోధించాలని సూచించారు. డిజిటల్ అభ్యసన పుస్తకాలు, ఖాన్ అకాడమీ, స్టెమ్ విద్యా కార్యక్రమాలు, శిక్ష కో పైలట్ ప్రాజెక్టు వంటి కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విద్యార్థులకు విషయ పరిజ్ఞానంపై స్పష్టమైన అవగాహన కల్పించవచ్చని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న నూతన బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో అమలు చేయాలని, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి బి. మహేష్ నాయక్, కోర్సు ఇన్‌చార్జి మరియు మండల విద్యాధికారి భిక్షపతి, నాగేశ్వరరావు, వనరుల వ్యక్తులు, శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### అనంతసాగరం, జయగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**హసన్‌పర్తి, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. హసన్‌పర్తి మండలంలోని అనంతసాగరం, జయగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులను ఆశ్రయించకుండా నేరుగా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్యే కోరారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పాక్స్ చైర్మన్ పింగళి వెంకటరాం నరసింహ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, హసన్‌పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, మాజీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మల్లారెడ్డిపల్లి పాక్స్ చైర్మన్ కుమారస్వామి, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, మండల మహిళా ఉపాధ్యక్షురాలు స్వాతి, సర్పంచ్ వెన్నెల దయాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు కుమార్, సీనియర్ నాయకులు విసం సురేందర్ రెడ్డి, చిర్ర విజయ్, శ్రీరాములు, ఉదయ్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రామంచ ఐలయ్య, గరిగె రాజు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించి మెరుగైన చికిత్స అందించడమే ఆర్‌బీఎస్‌కే లక్ష్యం: డాక్టర్ బి. దుర్గా ప్రసాద్





### అంబాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు.. ఆరోగ్య సంరక్షణపై వైద్యుల అవగాహన
### విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఉపాధ్యాయులు

**కమలాపూర్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**



విద్యార్థిని, విద్యార్థుల ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించడమే రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ప్రధాన లక్ష్యమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. దుర్గా ప్రసాద్ తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల స్థాయిలోనే వివిధ ఆరోగ్య సమస్యలను గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కమలాపూర్ మండలం అంబాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తూ వివిధ రకాల వైద్య పరీక్షలు చేపట్టింది. పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, రక్తహీనత, విటమిన్ల లోపం, వివిధ వ్యాధులు, అభివృద్ధిలో ఆలస్యం, వైకల్యాలు, కంటి చూపు సమస్యలు, వినికిడి లోపాలు, దంత సమస్యలు తదితర వాటిని ముందస్తుగా గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల శారీరక ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. దుర్గా ప్రసాద్, డాక్టర్ టి. కవిత మాట్లాడుతూ పిల్లల్లో ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సకాలంలో చికిత్స అందించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించినట్లయితే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి అవసరమైన తదుపరి వైద్య పరీక్షలు, చికిత్సలు అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఆరోగ్య పరీక్షలు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ఆరోగ్యవంతమైన విద్యార్థులే విద్యలో రాణించి సమాజానికి మంచి భవిష్యత్తును అందించగలరని వైద్యులు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, ఎదుగుదల, పోషకాహారంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆరోగ్య పరీక్షల నిర్వహణలో ఏఎన్ఎం శారద వైద్య బృందానికి సహకరించారు. విద్యార్థులకు ఆరోగ్య సంబంధిత సూచనలు అందిస్తూ వివిధ ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ద్వారా వైద్య బృందాలు పాఠశాలలను సందర్శించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాయని వైద్య అధికారులు తెలిపారు. గుర్తించిన ఆరోగ్య సమస్యలకు అవసరమైన వైద్య సేవలు, చికిత్స అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజారాణి, ఉపాధ్యాయులు ఆలేటి నరసింహారెడ్డి, శ్రీనివాస్, భారతి, రజిత, పీడీ లక్ష్మి, జూనియర్ అసిస్టెంట్లు సరస్వతి, రహమత్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన తనిఖీలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజారాణి, ఉపాధ్యాయులు ఆలేటి నరసింహారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించడం వారి ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని, విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఈ సందర్భంగా తెలిపారు.

# రైతుల మోటార్లే టార్గెట్.. 84 మోటార్లతో దొంగల ముఠా పట్టుబాటు!

### రూ.18.44 లక్షల విలువైన మోటార్లు స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్, అదుపులో మరో నలుగురు

**వరంగల్, నవంబర్ 19 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ నీటి మోటార్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను నర్సంపేట పోలీసులు పట్టుకున్నారు. రాత్రి వేళల్లో గ్రామ శివారు ప్రాంతాల్లో తిరుగుతూ రైతుల మోటార్లను అపహరించి, వాటిని విక్రయించడం ద్వారా సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఈ ముఠా దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేయగా, మరో నలుగురు బాలురను (సీసీఎల్) అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ.18,44,800 విలువైన 84 విద్యుత్ నీటి మోటార్లతో పాటు దొంగతనాలకు ఉపయోగించిన నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో నర్సంపేట సబ్ ఇన్‌స్పెక్టర్ రాజన్ బాబు తన సిబ్బందితో కలిసి రాజుపేట క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ట్రాలీ ఆటోతో పాటు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వరంగల్ సీసీఎస్ పోలీసుల సహకారంతో విచారణ చేపట్టగా, నిందితులు డీజే ఆపరేటర్లుగా, స్టేజ్ డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, చెన్నారావుపేట, ఖానాపూర్, నెక్కొండ, ములుగు మండలాల పరిధిలోని శివారు గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ నీటి మోటార్లను దొంగిలిస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. దొంగిలించిన మోటార్లను విక్రయించేందుకు రాజుపేట గ్రామ శివారులోని చెట్ల పొదల్లో దాచిపెట్టినట్లు నిందితులు వెల్లడించడంతో పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 84 విద్యుత్ నీటి మోటార్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.18,44,800గా అంచనా వేశారు. చోరీలకు ఉపయోగించిన ట్రాలీ ఆటో ఒకటి, ప్యాసింజర్ ఆటో ఒకటి, పల్సర్ మోటార్ సైకిల్ ఒకటి, షైన్ మోటార్ సైకిల్ ఒకటి కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో హంస ప్రశాంత్ (27), అన్న శివప్రసాద్ (22), ఎస్.కె. దస్తగిరి అలియాస్ షైర్ (20)లను ప్రధాన నిందితులుగా అరెస్ట్ చేయగా, మరో నలుగురు బాలురను (సీసీఎల్) అదుపులోకి తీసుకున్నారు. వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల భద్రతపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సూచించారు. గ్రామ శివారు ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినా, మోటార్ల దొంగతనాలు జరిగినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. దొంగతనాల నివారణకు పోలీసులకు సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఈస్ట్ జోన్ డీసీపీ నగదు రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, నర్సంపేట ఇన్‌స్పెక్టర్ ముస్కా శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజన్ బాబు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు హరికృష్ణ, రాఘవేందర్ రావు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కిట్స్ వరంగల్‌లో నవంబర్ 24న 43వ గ్రాడ్యుయేషన్ డే

### 2026 బ్యాచ్ విద్యార్థులకు డిగ్రీల ప్రదానం.. 14 బంగారు పతకాలు అందజేత

**హసన్ పర్తి, నవంబర్ 19(జై భీమ్ న్యూస్)**




కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) వరంగల్‌లో ఈ నెల 24న 43వ వార్షిక గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి తెలిపారు. 2022--2026 విద్యా సంవత్సరానికి చెందిన తొమ్మిదవ స్వయంప్రతిపత్తి బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుక కిట్స్ క్యాంపస్‌లోని ప్లే ఫీల్డ్స్‌లో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి హాజరుకానుండగా, గౌరవ అతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ పాల్గొననున్నారు. కిట్స్ పాలకమండలి చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు అధ్యక్షత వహించనున్నారు. ఈ సందర్భంగా 2026 బ్యాచ్‌కు చెందిన యూజీ, పీజీ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయడంతో పాటు విద్యా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 14 బంగారు పతకాలు అందజేయనున్నారు. విద్యార్థులందరూ గ్రాడ్యుయేషన్ డేకు తప్పనిసరిగా హాజరై తమ డిగ్రీలను స్వయంగా స్వీకరించాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో కిట్స్ ట్రెజరర్ పి. నారాయణ రెడ్డి, అదనపు కార్యదర్శి వొడితల సతీష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, డీన్లు, హెచ్ఓడీలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొననున్నారు. కిట్స్ పీఆర్వో డాక్టర్ డి. ప్రభాకర చారి తెలిపారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి: సీఎం రేవంత్ రెడ్డి

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ లక్ష్యం**
**85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సు ప్రారంభం**

**హైద్రాబాద్, నవంబర్ 19(జై భీమ్ న్యూస్)**



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. దేశ ప్రగతి, జాతీయ ప్రాధాన్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమం వంటి అంశాల్లో రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని, మిగిలిన సమయమంతా దేశాభివృద్ధిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం కూడా స్పష్టమైన విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. తెలంగాణను మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించినట్లు సీఎం వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా అభివృద్ధి చేయాలని, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని, రీజినల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రంగాల అభివృద్ధికి మెరుగైన రవాణా సౌకర్యాలు, పటిష్టమైన రోడ్డు నెట్‌వర్క్ అవసరమని పేర్కొన్నారు. నగరాలు, గ్రామాలు, పారిశ్రామిక కారిడార్లను అనుసంధానిస్తూ రోడ్ల అభివృద్ధి చేపట్టడం ద్వారా కనెక్టివిటీ, మొబిలిటీ పెరుగుతాయని, వ్యాపార, వాణిజ్య రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. తెలంగాణలో చేపట్టాల్సిన రోడ్డు నెట్‌వర్క్‌కు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్రానికి పలు సందర్భాల్లో అందించినట్లు గుర్తుచేశారు. వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో రోడ్లతో పాటు ఆరోగ్య రంగానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. పురాతన ఉస్మానియా జనరల్ ఆసుపత్రిని అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నామని, రాష్ట్రంలోని టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు మొత్తం 8 వేల పడకల సామర్థ్యంతో ఆసుపత్రులను నిర్మిస్తున్నట్లు వివరించారు. 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడం గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగస్వాములు కావాలని సదస్సుకు హాజరైన ప్రతినిధులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐఆర్‌సీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ పది, ఇతర కార్యవర్గ సభ్యులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ సంస్థలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

# ఎంజీఎంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి..**
**ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**

**వరంగల్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం నగరంలోని ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించి వివిధ వైద్య విభాగాల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నవజాత శిశు సంరక్షణ విభాగం, అసంక్రమిత వ్యాధుల చికిత్స విభాగం, వృద్ధుల సంరక్షణ విభాగం, పోషకాహార పునరావాస కేంద్రం, జిల్లా ప్రారంభ జోక్య కేంద్రాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను సమీక్షించారు.ఆయా విభాగాల్లో రోగులకు అందిస్తున్న చికిత్స, వైద్య సదుపాయాలు, నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందిని సేవలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్లను సైతం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, మందులు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు.

**వైద్య సేవల్లో నాణ్యతకు ప్రాధాన్యం**

ఎంజీఎం ఆసుపత్రిలోని అన్ని వైద్య విభాగాల్లో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. రోగుల పడకలపై బెడ్‌షీట్లను ఎప్పటికప్పుడు మార్చుతూ శుభ్రంగా ఉంచాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య సూచికలో మెరుగైన ప్రగతి సాధించేలా వైద్యులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, వార్డులు, ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

**భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంపై అసహనం**

ఆసుపత్రిలో భద్రతా సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. భద్రతా సిబ్బంది తమ విధుల పట్ల పూర్తి నిబద్ధతతో వ్యవహరించాలని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఆసుపత్రి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీలో రాష్ట్ర స్థాయిలో హనుమకొండ జిల్లాకు మొదటి ర్యాంక్

## రైతుల నమోదు ప్రక్రియలో అధికారులు, సిబ్బంది సమన్వయ కృషి ఫలితం

**హన్మకొండ, నవంబర్ 19(జై భీమ్ న్యూస్)**

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియలో హనుమకొండ జిల్లా తెలంగాణ రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించింది. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేపట్టిన కృషి ఫలితంగా ఈ ఘనత సాధించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (అగ్రిస్టాక్)లో భాగంగా ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను అందించేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలు, ఇతర సిబ్బంది సమన్వయంతో గ్రామాల్లో రైతుల నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. అధికారులు ఉదయం 7 గంటల నుంచే గ్రామాలను సందర్శిస్తూ రైతులకు అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియలో సహకరించారు. రైతులకు సేవలందించాలనే లక్ష్యంతో సెలవు దినాల్లో కూడా గ్రామాలను సందర్శించి పనిచేయడం ద్వారా జిల్లా ఈ విజయాన్ని సాధించింది. తెలంగాణ రాష్ట్రం ఫార్మర్ రిజిస్ట్రీ నమోదులో దేశంలోనే మొదటి స్థానంలో నిలవడంతో కేంద్ర ప్రభుత్వం రూ.1,087 కోట్ల ప్రోత్సాహక నిధులను అందించినట్లు అధికారులు పేర్కొన్నారు.

**ఫార్మర్ రిజిస్ట్రీతో రైతులకు ప్రయోజనాలు**

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ద్వారా రైతులకు అనేక ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సులభంగా అందనున్నాయి. పీఎం కిసాన్, రైతు భరోసా, పంటల బీమా వంటి పథకాల నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడానికి ఈ రిజిస్ట్రీ ఉపయోగపడుతుంది..యూరియా, డీఏపీ వంటి రాయితీ ఎరువులను సులభంగా పొందేందుకు రైతు ఐడీ కీలకంగా మారనుంది. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడంతో పాటు శాస్త్రీయంగా ఎరువుల వినియోగం ద్వారా భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచి రైతుల పెట్టుబడి ఖర్చును తగ్గించేందుకు దోహదపడుతుంది. అలాగే ధాన్యం, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు విక్రయించేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ ఉపయోగపడుతుంది. కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ), పంట రుణాల మంజూరు ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. భూమి రికార్డులు ఆధార్‌తో అనుసంధానం కావడం వల్ల నకిలీ లబ్ధిదారులను గుర్తించి, నిజమైన అర్హులైన రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందించేందుకు పారదర్శకత పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

# హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

**విద్యార్థుల సేవలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి**
**కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం**

**కేయూ క్యాంపస్, 19 నవంబర్ (జై భీమ్ న్యూస్)**



హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందించాలని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం హాస్టల్



సిబ్బందికి సూచించారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో హాస్టల్ ఉద్యోగులు, సంయుక్త సంచాలకులు, కేర్‌టేకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.హాస్టళ్లలో పరిశుభ్రత, సమయపాలన, సమన్వయం, విధుల పట్ల బాధ్యత తప్పనిసరిగా ఉండాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. 199 మంది సిబ్బంది, 73 మంది అదనపు కార్మికులు ఉన్నప్పటికీ కామన్ మెస్, మహిళా హాస్టళ్లలో సమస్యలు కొనసాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సరుకుల నాణ్యత, సరఫరాలో లోపాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు.ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ, హాస్టళ్ల నిర్వహణలో కేర్‌టేకర్ల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ, నిర్దేశించిన నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలన కృషి చేస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో అభివృద్ధి అధికారి ఆచార్య వై. వెంకయ్య, డైరెక్టర్లు డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ సుమలత, హాస్టల్ ఉద్యోగులు, కేర్‌టేకర్లు, సంయుక్త సంచాలకులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# బాలల భద్రతపై నిర్లక్ష్యం తగదు..

**హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత**
**వేధింపులపై మౌనం వీడాలి..**
**చట్టాలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలి**
**విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించిన సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి**




**రాజమహేంద్రవరం,19 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నవంబర్ 10 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న పాన్ ఇండియా పాఠశాల స్థాయి న్యాయ అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం రాజమహేంద్రవరంలోని శ్రీనివాస రామానుజన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలక్ష్మి విద్యార్థులకు బాలల హక్కులు, రక్షణ చట్టాలు, చట్టపరమైన సహాయంపై వివరించారు.న్యాయ సేవాధికార చట్టం--1987, పోక్సో చట్టం--2012, ర్యాగింగ్ నిషేధ చట్టాల గురించి వివరించారు. బాలలపై వేధింపులు, అన్యాయాలు జరిగినప్పుడు భయపడకుండా ధైర్యంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, సహనశీలత, మంచి నడవడిక అలవర్చుకొని లక్ష్య సాధన దిశగా కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు.అనంతరం పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉన్నా, న్యాయపరమైన సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాల కోసం జాతీయ న్యాయ సేవల హెల్ప్‌లైన్ నంబర్ 15100కు ఫోన్ చేయవచ్చని విద్యార్థులకు వివరించారు.

# విద్యార్థిని పట్ల పీఈటీ అసభ్య ప్రవర్తన..

**ఖమ్మం, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్) :**

ఒక విద్యార్థిని పట్ల పీఈటీ అసభ్య ప్రవర్తన విషయం తెలుసుకుని పేరెంట్స్ స్కూలు లో దాడికి దిగారు. ఖమ్మం నగరంలోని పాకబండ బజార్ లిటిల్ ఇండియన్స్ స్కూల్‌లో ఘటన జరిగింది. ఆరవ తరగతి విద్యార్థినితో పీఈటీ అసభ్యంగా ప్రవర్తించాడని తల్లిదండ్రుల ఆరోపణ. ఆగ్రహంతో స్కూల్‌కు తల్లిదండ్రులు, బంధువులు చేరుకుని ఆందోళనకు దిగారు. ఆందోళనలో భాగంగా స్కూల్‌లో ఫర్నిచర్ ధ్వంసం చేసారు. తల్లిదండ్రుల ఆందోళనకు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతుగా నిలి చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పీఈటీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

# నగర చెత్తపై శాస్త్రీయ అధ్యయనం

### జీడబ్ల్యూఎంసీ-ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ సంయుక్తంగా వ్యర్థాల పరిశీలనకు శ్రీకారం
### 90 ఇళ్లతో పాటు వాణిజ్య, సంస్థాగత కేంద్రాల్లో సర్వే







**వరంగల్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మెరుగుపరిచేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, చెన్నైకి చెందిన ఎం.ఎస్. స్వామినాథన్ పరిశోధనా సంస్థ సంయుక్తంగా నగరవ్యాప్త వ్యర్థాల అధ్యయనాన్ని ప్రారంభించాయి. వెల్‌కమ్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో చేపడుతున్న ఈ అధ్యయనం ద్వారా నగరంలో ఉత్పత్తి అవుతున్న చెత్త పరిమాణం, సేకరణ, వర్గీకరణ, పునర్వినియోగం, పారవేత విధానాలను శాస్త్రీయంగా పరిశీలించనున్నారు.వివిధ ఆదాయ వర్గాలకు చెందిన 90 ఇళ్లతో పాటు మార్కెట్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, పాఠశాలలు, కార్యాలయాలు, ఆసుపత్రుల్లో సర్వే నిర్వహిస్తారు. వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను పరిశీలించి పునర్వినియోగానికి అనువైన పదార్థాలను గుర్తించనున్నారు.ఈ అధ్యయనం ద్వారా చెత్త సేకరణలో లోపాలు, సేకరణకు నోచుకోని వ్యర్థాల శాతం, పునర్వినియోగ స్థాయిలు, మౌలిక సదుపాయాల అవసరాలపై స్పష్టత రానుంది. ఈ సమాచారంతో భవిష్యత్తులో మెరుగైన పారిశుద్ధ్య సేవలకు నగరపాలక సంస్థ ప్రణాళికలు రూపొందించనుంది.ఈ నెల 19, 20 తేదీల్లో దివ్యదీప్తి భవన్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులు, కాకతీయ విశ్వవిద్యాలయం సామాజిక సేవా విభాగం విద్యార్థి స్వచ్ఛంద కార్యకర్తలకు సర్వే పద్ధతులు, చెత్త వర్గీకరణ, తూకం, వివరాల నమోదు, భద్రతా ప్రమాణాలపై శిక్షణ ఇస్తున్నారు. మొత్తం అధ్యయనాన్ని ఏడు వారాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ, అధ్యయన విజయవంతానికి ప్రజలు సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. పరిశోధనా సంస్థ ప్రతినిధి డాక్టర్ ప్రతిభ గణేశన్ మాట్లాడుతూ, ఈ అధ్యయనం పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య సేవల మెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఆరోగ్యాధికారులు డాక్టర్ మల్లం రాజేష్, డాక్టర్ వెంకటేశ్వర్ రావు, డాక్టర్ సబా, ఇతర అధికారులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 50వ వార్డు అభివృద్ధికి సీపీఎం అభ్యర్థిని గెలిపించండి

### ధనలక్ష్మి గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం



**కాకినాడ, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో 50వ వార్డు నుంచి పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి ధనాల ధనలక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బా శేషబాబ్జి, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ 50వ వార్డులో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉందని, దోమల సమస్య తీవ్రంగా ఉందని, తాగునీటి ఇబ్బందులు కూడా ప్రజలను వేధిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారంతో పాటు వార్డు సమగ్ర అభివృద్ధికి సీపీఎం అభ్యర్థి ధనాల ధనలక్ష్మిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ కష్టజీవులు, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పనిచేస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే పార్టీకి మద్దతుగా నిలిచి, తమ అమూల్యమైన ఓటుతో ధనలక్ష్మిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గెలుపే లక్ష్యంగా వార్డులో ఇంటింటి ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తలుపులమ్మ, రాణి, నాగలక్ష్మి, ఆదర్శ్, ప్రసాద్, అనిల్ కుమార్, కిషోర్, కౌసల్య, జాను, రేణుక, కటారి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

# జువెనైల్ హోమ్ పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలి

### వారి నడవడికలో మార్పు తీసుకురావడం అందరి బాధ్యత
### డాక్టర్ అనితా రెడ్డి

**వరంగల్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

బాలల హక్కుల పరిరక్షణతో పాటు, జువెనైల్ హోమ్‌లో ఉంటున్న పిల్లల వ్యక్తిత్వ వికాసానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, మాజీ బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా గురువారం వరంగల్ ఆటోనగర్‌లోని జువెనైల్ హోమ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలకు జీవిత విలువలు, బాలల హక్కులు, బాధ్యతలు, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. తెలిసీతెలియని వయసులో, అవగాహన లోపంతో కొన్ని తప్పులు చేసి జువెనైల్ హోమ్‌కు చేరిన పిల్లల పట్ల సమాజం వివక్ష చూపకుండా ప్రేమతో, ఆప్యాయతతో వ్యవహరించాలన్నారు. వారిలో ఆత్మవిశ్వాసం నింపి, ప్రవర్తనలో సానుకూల మార్పు తీసుకొచ్చి, తిరిగి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా తీర్చిదిద్దడం అందరి బాధ్యతని పేర్కొన్నారు.ప్రతి బిడ్డకు రక్షణ, భద్రత, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రతి ఒక్కరూ బాలల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని, బాలలతో ముడిపడిన నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. హక్కులతో పాటు బాధ్యతలపై కూడా పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.బాలలే దేశ సంపద, భవిష్యత్తు పౌరులని పేర్కొన్న ఆమె.. వారిలో దేశభక్తి, పెద్దల పట్ల గౌరవం, క్రమశిక్షణ, మానవీయ విలువలను పెంపొందించేలా కౌన్సెలింగ్ నిర్వహించాలని జువెనైల్ హోమ్ సిబ్బందికి సూచించారు. పిల్లల వ్యక్తిత్వ వికాసానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.ప్రస్తుత పరిస్థితుల్లో కొంతమంది బాలలు మాదకద్రవ్యాలకు అలవాటు పడటం ఆందోళనకరమని, వాటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిల్లలకు సూచించారు. ప్రభుత్వం బాలల భవిష్యత్తు కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారానే జ్ఞానం, నైపుణ్యాలు పెంపొందించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు.అనంతరం జువెనైల్ హోమ్‌లోని పిల్లలందరికీ డాక్టర్ అనితా రెడ్డి ఉచితంగా రగ్గులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జువెనైల్ హోమ్ సూపరింటెండెంట్ శ్రీదేవి, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.



# రబీ సాగుకు నీటి భరోసా.. ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలి





### రైతులకు సాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు..
### అగ్రిస్టాక్‌లో వివరాల నమోదు వేగవంతం చేయాలి
### కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

రాబోయే రబీ సీజన్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో రబీ సాగు ప్రణాళిక, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, కాలువలు, డ్రైన్ల పూడికతీత పనులపై సమీక్షించారు. తూర్పు, పశ్చిమ డెల్టాల పరిధిలో సుమారు 1.27 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు వివరించారు. డిసెంబర్ నెలాఖరులోగా నాట్లు పూర్తి చేసి, మార్చి 31 నాటికి పంట కోతలకు వచ్చేలా నీటి విడుదల షెడ్యూల్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో నీటి ఎద్దడి రాకుండా రైతులు ముందుగానే నాట్లు పూర్తి చేసేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువలు, డ్రైన్లలో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలని, రసాయన మందులకు బదులుగా యంత్రాలు, కూలీలతో కలుపు తొలగించాలని ఆదేశించారు. దెబ్బతిన్న చెరువుల గట్ల మరమ్మతులు, షట్టర్ల పటిష్టత పనులు చేపట్టాలని, తుఫాన్ల కారణంగా గండ్లు పడిన చెరువులకు వెంటనే మరమ్మతులు చేసి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలని, ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించాలని, పంటల బీమాపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. లిఅగ్రిస్టాక్ పోర్టల్‌లో రైతుల భూమి వివరాలు, సాగు విస్తీర్ణం, ఇతర వ్యవసాయ సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేసి ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలనిలి సూచించారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ సేవలను రైతులకు మరింత సమర్థవంతంగా అందించవచ్చని అధికారులు వివరించారు. ఇందుకోసం కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, జిల్లా నీటిపారుదల అధికారి జి. శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు, సాగునీటి సలహా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.


# రేషన్ దుకాణంలో అక్రమ దందా..!

### ఇతర రాష్ట్రంలో అసలు డీలర్.. ఇక్కడ భర్త చేతుల్లో నిర్వహణ
### కిరాణా సరుకులు కొనాలంటూ లబ్ధిదారులపై ఒత్తిడి?
### పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు

**మామూనూరు,19 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

ఖిలావరంగల్ మండలం మామూనూరులోని చౌకధరల దుకాణం నంబరు 4318061 నిర్వహణపై పలు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. మహిళ పేరు మీద ఉన్న రేషన్ దుకాణాన్ని ఆమె భర్త నిర్వహిస్తున్నారని, అసలు డీలర్ ఇతర రాష్ట్రంలో నివసిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.కిరాణా దుకాణం ప్రాంగణంలోనే రేషన్ సరుకులు పంపిణీ చేస్తూ, బియ్యం తీసుకునేందుకు వచ్చే లబ్ధిదారులను ఇతర సరుకులు కూడా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. అంతేకాకుండా పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.డీలర్ గైర్హాజరీలో భర్త దుకాణం నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ అనుమతి ఇచ్చిందా? అనుమతి లేకుండానే నిర్వహణ కొనసాగుతోందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, డీలర్ నియామక ఉత్తర్వులు, ఈ-పాస్ లావాదేవీలు, రేషన్ నిల్వలు, పంపిణీ రికార్డులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుని, లబ్ధిదారులకు పారదర్శకంగా రేషన్ అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





PROCEEDINGS OF THE REVENUE DIVISIONAL OFFICER, WARANGAL
PRESENT: Sri CH. MAHENDER JI

Proc.No.D/559/2022 Dated: 24.05.2022

Sub: CIVIL SUPPLIES –Warangal District and Division- Khila Warangal Mandal – Laxmingar, Kareemabad Ursu(V) – FP Shop Dealer Shop No.4318054 – Smt. Gullapalli (Chidurala) Ramadevi W/o Nageshwar – Committed certain irregularities in distribution of essential commodities for the variation of stock Authorization – Cancellation and misguide the Higher authorities for Authorization – Cancellation of Authorization- Orders – Issued.

Read:- 1. The Tahsildar, Khila Warangal Mandal, Lr.No. A/438/2022, Dtd: 08-04-2022
2. A/o Sri. Bairi Kumar S/o Buchaiah R/o Ursu Kareemabad, Dtd: 16.05.2022
3. A/o Smt. Gullapalli (Chidurala) Ramadevi W/o Nageshwar R/o Laxmingar, Kareemabad Ursu(V), Khila Warangal Mandal, Dtd:21.05.2022.

ORDER:

...

The Tahsildar, KhilaWarangal Mandal vide reference 1st cited, has submitted that, after due local enquiry and proposed for renewal of the (10) PP Shop Dealers of Khila Warangal Mandal including the FP Shop No.4318054 of PP Shop dealer Smt. Gullapalli (Chidurala) Ramadevi W/o Nageshwar R/o Laxmingar, Kareemabad Ursu(V), Khila Warangal (M) was also recommended for renewal of authorization and stated that there are no 6-A cases booked against the FP Shop dealers.

In this regard, based on the recommendation of the Tahsildar, Khilawarangal Mandal, renewed authorization FP Shop dealer Smt. Chidurala Ramadevi, FP Shop No. 4318054 located at Kareemabad Ursu of Khila Warangal Mandal for the period of 2022 to 2024.

Further 2nd read above, Sri. Bairi Kumar S/o Buchaiah R/o Ursu Kareemabad, Khilawarangal (M) has filed complaint stating that as he was running incharge for the FP Shop No. 4318054 located at Ursu Kareemabad of Khilawarangal Mandal since 19.09.2015 (as per Proceedings of the Revenue Divisional Officer No. E/4204/2015 Dtd:17.05.2016). Further stated that Gullapalli (Chidurala) Ramadevi W/o Nageshwar has committed irregularities in distribution of essential commodities for the variation of stock i.e .PDS Rice (0.64 Qtls) to the card holders, the authorization was cancelled.(as per the proceedings of Revenue Divisional Officer, Warangal, No. E/2779/2015, Dtd: 19.09.2015). One Sri. Manda Ramchander have misguided the Officials for renewal of authorization of G.Ramadevi. Further the applicant requested to cancel the authorization of G.Ramadevi as he was running FP Shop No. 4318054 since 2015.

In view of the above, it is clear that the authorization issued to Smt. Gullapalli (Chidurala) Ramadevi for the FP Shop No. 4318054 located at Ursu Kareemabad of Khilawarangal Mandal has been cancelled and she was not in existence as dealer as she was not reinstated as FP Shop dealer and not issued authorization again.

Hence, the authorization renewed for the FP Shop No. 4318054 of Smt. Gullapalli (Chidurala) Ramadevi, FP Shop dealer is hereby cancelled with immediate effect.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌పై విస్తృత ప్రచారం చేపట్టాలి

**డిసెంబర్ 11 నుంచి 22 వరకు క్రీడా సంబరాలు**
**వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 నిర్వహణలో భాగంగా డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న క్రీడా పోటీలపై విస్తృత ప్రచారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో క్రీడా కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని ప్రోత్సహించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడా కార్యక్రమాల గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతకు విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సంబంధాల అధికారి ప్రేమలత, యువజన, క్రీడల అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఎంజీఎంలో ఆహార భద్రత తనిఖీలు ఎక్కడ?

**మెనూ ప్రకారం భోజనం అందడం లేదని రోగుల ఆవేదన**
**కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి వచ్చిన సమస్యలు.. నెలకోసారైనా తనిఖీలు చేపట్టాలని డిమాండ్**

**వరంగల్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్):**

వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ఆహార భద్రత అధికారులు ఎందుకు తరచూ తనిఖీలు నిర్వహించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆసుపత్రిలో రోగులకు ప్రభుత్వం నిర్దేశించిన ఆహార పట్టిక ప్రకారం భోజనం అందడం లేదని, ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తనిఖీలు జరిగిన రోజున మాత్రమే హడావుడి కనిపిస్తోందని, ఆ తర్వాత మళ్లీ పాత పరిస్థితులే కొనసాగుతున్నాయని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన భోజనం అందకపోవడంతో కొందరు బయట నుంచి ఆహారం తెచ్చుకోవాల్సి వస్తోందని, అనారోగ్యంతో ఉన్న రోగులకు తగిన పోషకాహారం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఇటీవల ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార సరఫరా, వైద్య సేవల్లోని లోపాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్యం సరిగా లేకపోవడం, సరైన వెలుతురు లేకపోవడం, నవజాత శిశువుల విభాగంలో అవసరమైన పరికరాల కొరత, కొన్ని ప్రత్యేక వైద్య విభాగాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేక కొందరు చిన్నారులను హైదరాబాద్ లేదా ఇతర ఆసుపత్రులకు తీసుకెళ్లాలని సూచిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. తనిఖీ సమయంలో కొన్ని విభాగాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంపైనా కలెక్టర్ ఆరా తీసి, పరిస్థితులపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార సరఫరా కాంట్రాక్టు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో ఆహార సరఫరా బాధ్యతలు నిర్వహిస్తున్న విభాగం, డైటీషియన్, ఆర్ఎంఓ, సూపరింటెండెంట్ తమ విధులను సమన్వయంతో నిర్వహించి రోగులకు నిర్దిష్ట మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు. ముఖ్యంగా ఆహార భద్రత అధికారులు కనీసం నెలకు ఒకసారైనా ఎంజీఎం ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించి, ఆహార నాణ్యత, నిల్వ, తయారీ, పంపిణీ విధానాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీతోనైనా ఆసుపత్రిలో పరిస్థితులు మెరుగుపడి రోగులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వైద్య సేవలు, పరిశుభ్రమైన వాతావరణం అందించాలని ప్రజలు ఆశిస్తున్నారు.




# 57, 58 డివిజన్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారం జోరు

**కూటమి ప్రభుత్వంపై విమర్శలు-ఇన్చార్జి వేణు**

**గుంటూరు, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా అంజిరెడ్డి కాలనీలో 57వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి లక్ష్మీ రోజా మరియు 58వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కళ్లం రాజశేఖర్ రెడ్డి ఉమ్మడిగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి కేతవత్ పున్నా నాయక్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త, బుర్రుముక్కు వేణుగోపాల సోమి రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరినీ అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు ప్రతి ఇంటికి తిరిగి ప్రచారం చేపట్టారు.గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ఇంటింటికీ తిరిగి ప్రజలకు ఎంతో సేవ చేసి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడం జరిగిందని వేణుగోపాల స్వామి రెడ్డి గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో 'సూపర్ సిక్స్' వాగ్దానాలను అమలు చేస్తామని చెప్పి ప్రజలకు బాండ్లు ఇచ్చి మోసం చేసిందని తీవ్రంగా ఆరోపించారు.18 సంవత్సరాలు నిండిన ఆడబిడ్డలకు 'ఆడబిడ్డల నిధి' కింద నెలకు రూ. 1,500 ఇస్తామని హామీ ఇచ్చి, ఇంతవరకు ఆ పథకం ఊసే ఎత్తలేదని విమర్శించారు. అలాగే డిగ్రీ పూర్తి చేసుకున్న యువతకు నిరుద్యోగ భృతి మరియు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి రెండింటిలోనూ విఫలమయ్యారని పేర్కొన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీలకు 50, 60 సంవత్సరాలు నిండిన వారందరికీ పెన్షన్లు ఇస్తామని చెప్పి ఒక్కరికి కూడా ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. ఉన్న 65 లక్షల పెన్షన్లలో సుమారు 6 లక్షలకు పైగా తొలగించారని, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని తెలిపారు.అమరావతిలో కేవలం అద్దాల కోసం రూ. 2,500 కోట్లు కేటాయించారని, అభివృద్ధి పేరుతో అమరావతిలో అడ్డగోలు దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యంగా మంగళగిరి నియోజకవర్గంలో ఇసుక, మట్టి మరియు రాజధాని పనుల కాంట్రాక్ట పేరుతో విపరీతమైన దోపిడీ సాగుతోందని, మంగళగిరిని దోపిడీకి అడ్డాగా మార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వైన్స్ షాపులను తమ అనుచరులకు కట్టబెడుతూ, ఎమర్జెన్సీ పరిపాలన విధిస్తూ ఎవరు మాట్లాడినా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఇటీవల దుగ్గిరాల ఎన్నికల్లోనూ అన్యాయాలు, అక్రమాలు జరిగాయని, ప్రజలందరూ ఈ విషయాలను గమనించాలని కోరారు. కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలు, దుర్మార్గాలు ఎండగట్టడానికి ఓఓఅ ఎన్నికల్లో ప్రజలు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలోనైనా సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రజలకు అందాలంటే ఈ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని ఓడించాలని పేర్కొన్నారు.సమాజ సేవకుడిగా కళ్లం రాజశేఖర్ రెడ్డి గారు సుమారుగా గత 13 సంవత్సరాల పైగా అనేక చారిటబుల్ ట్రస్టులను నిర్వహిస్తూ ప్రజాసేవలో ముందంజలో ఉన్నారని వేణుగోపాల స్వామి రెడ్డి తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికి మంచినీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేసి అందరికీ సురక్షితమైన నీటిని అందిస్తున్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు ఉపయోగపడేలా అంబులెన్స్ సర్వీసులను అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా, మృతి చెందిన వారి అంత్యక్రియల నిమిత్తం 'మహాప్రస్థానం' పేరుతో ఉచిత వాహన సేవలను ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు.విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ, జెడ్పీ హైస్కూల్‌లో పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. తన దృష్టికి వచ్చిన అనేకమంది పేద విద్యార్థులకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం చేస్తూ విద్యాభివృద్ధికి పాటుపడుతున్నారు. గతంలో ఒక ఉచిత ఆసుపత్రిని కూడా నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించిన అనుభవం ఆయనకుంది. ఇలాంటి సేవా దృక్పథం కలిగిన కళ్లం రాజశేఖర్ రెడ్డి గారిని గెలిపిస్తే, రాబోయే రోజుల్లో పట్టణ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తారని ఆయన వెల్లడించారు.మరోవైపు, 57వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ స్థానానికి పోటీ చేస్తున్న లక్ష్మీ రోజా గారు గత మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా ఎన్నికై ప్రజలకు సేవలు అందించారు. కౌన్సిలర్‌గా తన తోటి సభ్యులతో కలిసి స్థానిక సమస్యల పరిష్కారం కోసం సమర్థవంతంగా పనిచేశారు. ఆ కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాలుపంచుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలందరికీ సక్రమంగా అందే విధంగా ఆమె విశేషంగా కృషి చేశారని ప్రజలు కొనియాడుతున్నారని తెలిపారు.

## 'రిగ్గింగ్ చేశాం.. గుర్తింపు ఇవ్వలేదు'.. ఇదేం విచిత్రమైన నిరసన సామీ

**గెలుపు కోసం ఏం చేశామో బహిరంగంగానే చెబుతూ.. పదవి కోసం రోడ్డెక్కిన టీడీపీ నేతలు**

శింగనమలలో ఎంపీపీ పదవి విషయంలో టీడీపీ నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఎమ్మెల్యే బండారు శ్రావణి ఇంటి ఎదుట ఎంపీటీసీ ఈశ్వర్ రెడ్డి వర్గీయులు ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా తాము కష్టపడి రిగ్గింగ్ చేసి గెలిపించినా ఎంపీపీ పదవి తమకు దక్కలేదని వారు ఆరోపించడం చర్చనీయాంశంగా మారింది.అంటే ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డామని తామే గొప్పగా చెప్పుకుంటున్నారా? అలా కష్టపడ్డామని చెప్పుకున్నా పదవి దక్కలేదని ఇప్పుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారా?ప్రజాస్వామ్యంలో గెలుపు కోసం కష్టపడాలి కానీ.. రిగ్గింగ్ చేశామని చెప్పుకోవడం దేనికి సంకేతం? పదవుల కోసం పోరాటం పక్కన పెడితే, ఈ మాటలే ఇప్పుడు అసలు చర్చగా మారాయి.

# ఈ-వ్యర్థాలపై బల్దియా ప్రత్యేక నిఘా!

**సేకరణ నుంచి తరలింపు వరకు పకడ్బందీ పర్యవేక్షణ**
**ప్రత్యేక కేంద్రాలు, మొబైల్ యాప్‌తో వ్యర్థాల నిర్వహణ**
**క్యూఆర్ కోడ్ విధానం అమలుకు శ్రీదేవి ఆదేశాలు**
**తొమ్మిది కార్పొరేషన్ల కమిషనర్లతో సమీక్ష**



**వరంగల్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

నగరాల్లో ఈ-వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, మున్సిపల్ పరిపాలన సంచాలకురాలు డా. టి.కె. శ్రీదేవి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ-వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, తరలింపు, శాస్త్రీయ నిర్వహణపై గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఈ-వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రకటించాలని సూచించారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ ఈ-వ్యర్థాలు, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి అధీకృత కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ స్థాయిలో వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థలు, వ్యాపార సముదాయాలను కాలుష్య నియంత్రణ మండలిలో తప్పనిసరిగా నమోదు చేయించాలని ఆదేశించారు. ఈ-వ్యర్థాల తరలింపును నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్ రూపొందించి, స్వచ్ఛ ఆటో డ్రైవర్లను అనుసంధానించాలని సూచించారు. రోజువారీగా ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల పరిమాణం, సేకరణ, తరలింపు వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, సేకరణ కేంద్రాలు, వాహనాలను సులభంగా గుర్తించేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాటలను పరిశీలిస్తాం :

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

అధికారముంది కదా అని నేనేం ఏది చేసినా నడుస్తనుకుంటే మాత్రం ఖబడ్దార్ బిడ్డా రేవంత్ రెడ్డి.. చెప్తున్నా యుద్ధం స్టార్ట్ అయితది. మూడేళ్ల పరిపాలన తర్వాత తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరంటూ మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారని తెలిసిందే. నాలుగు గోడల మధ్య రిప్రజెంటేషన్ ఇస్తేనేమో మీరు పట్టించుకుంటలేరాయే.. బయట మాట్లాడితేనేమో క్రమశిక్షణ అంటారని రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్టానం రిపోర్ట్ అడుగగా.. రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల వీడియోలను టీపీసీసీ అధిష్టానానికి పంపింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయం పరిశీలిస్తున్నామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ అన్నారు. సమయం వచ్చినప్పుడు అందరినీ పిలుస్తాం..అన్నీ కూడా నిశితంగా పరిశీలిస్తున్నాం.. క్రమశిక్షణ ముందు అందరూ సమానమేనని.. రాజగోపాల్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఏ సందర్భంలో ఏం మట్లాడారో.. అన్ని మాటలను పరిశీలిస్తామని చెప్పారు. ప్రతీ దానికి ఓ సమయం ఉంటదని చెప్పుకొచ్చారు.

# రామాంజనేయ కాలనీలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

**చుంచుపల్లి, నవంబర్ 19 (జై భీమ్ న్యూస్)**

కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాంజనేయ కాలనీలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. దాదాపు 100 ఇళ్లను తనిఖీ చేయడంతో పాటు 54 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను పరిశీలించారు. తనిఖీల్లో సుమారు 120 ఐఎంఎఫ్ఎల్ మద్యం బాటిళ్లను గుర్తించి నాలుగు కేసులు నమోదు చేశారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 45 జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ కాలనీవాసులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మూఢనమ్మకాలు, రహదారి భద్రత, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రజలు గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయవద్దని, ఓటీపీ, బ్యాంకు వివరాలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్పీ వెంట సబ్ డివిజన్ సిఐలు శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు, యాసీన్, జితేందర్, ఇంద్రసేనారెడ్డి ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# ఈ నీరు అమృతంతో సమానం!

ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలి వల్ల శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాటిలో ముఖ్యంతో వయసుతో సంబంధం లేకుండా వచ్చే స్థూలకాయం ఒకటి.ఊబకాయాన్ని తగ్గించుకోవడానికి మంచి ఆహారం, వ్యాయామమే మార్గం. అంతేకాకుండా కొన్ని ఇంటి చిట్కాలను పాటించడం వల్ల బరువు తగ్గొచ్చని మన పెద్దలు చెబుతున్నారు. బరువు తగ్గడానికి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగితే.. నిమ్మ, తేనె: ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయ, ఒక చెంచా తేనె, చిటికెడు ఎండుమిర్చి వేసి తినాలి. నల్ల మిరియాలలో పైపెరిన్ అనే మూలకం ఉంటుంది. ఇది శరీరంలో కొత్త కొవ్వు కణాలు పేరుకుపోవడానికి అనుమతించదు. నిమ్మకాయలో ఉండే ఆస్కార్బిక్ యాసిడ్ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. శరీరం నుండి విషపూరిత మూలకాలను తొలగించడంలో సహాయపడుతుంది. సోంపు నీరు: 6-8 సోంపు గింజలను ఒక కప్పు నీటిలో ఐదు నిమిషాలు మరిగించాలి. దీన్ని వడపోసి ఉదయం ఖాళీ కడుపుతో వేడి వేడిగా తాగాలి. ఇది అధిక ఆకలి సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాకుండా తినాలనే కోరికను తగ్గిస్తుంది. ఇది శరీరంలోని మురికిని శుభ్రపరుస్తుంది. మూత్రవిసర్జన, చెమట అధికంగా వచ్చేలా ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీరు: జీలకర్ర నీటిని తాగడం వల్ల స్థూలకాయం త్వరగా తగ్గుతుంది. ఇందులో క్యుమినాల్డిహైడ్, థైమోక్వినోన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. ఆర్థరైటిస్ , కీళ్ల నొప్పులు వంటి పరిస్థితులు ఉంటే, చికాకు, వాపును తగ్గించడంలో జీలకర్ర నీరు ప్రభావవంతంగా ఉంటుంది. మెంతి గింజల నీరు: మెంతి నీరు తాగడం వల్ల స్థూలకాయం తగ్గడమే కాకుండా మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో మెంతులు సహకరిస్తాయి. మెంతి నీటిని తయారు చేయడానికి, ముందుగా 1 టీస్పూన్ మెంతి గింజలను 1 గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. దీని తరువాత, ఉదయం నిద్రలేచిన తర్వాత, ఈ నీటిని వడపోసి ఖాళీ కడుపుతో తాగాలి.



## నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?



ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణులు.


## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?

పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్పరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %౮% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.



## గుండెపోటుకు గురికాకూడదనుకునే వారు వీటిని అలవాటు చేసుకోవాల్సిందే

ప్రస్తుత రోజుల్లో గుండెపోటు అనేది సర్వసాధారణమైపోయింది. ఇంతకుముందు ఈ సమస్య పెద్దవారిలో మాత్రమే కనిపించేది. కానీ, ఇప్పుడు యువత కూడా దీని బారిన పడుతున్నారు. ఎవరైనా డ్యాన్స్ చేస్తున్నప్పుడు, లేదా ఏదైనా పనిచేస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా పడిపోయారని మీరు తరచుగా వినే ఉంటారు. అలాంటి వారు కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తారు. వీటన్నింటికీ ప్రధాన కారణం ధమనులలో ఫలకం అడ్డుపడటం. దీని కారణంగా రక్తం గుండెకు చేరదు. శరీరంలో ఆక్సిజన్ కొరత ఉంటుంది. ఈ పరిస్థితిలో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నింటినీ నివారించడానికి, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు అవసరం. అందుకోసం ఈ అలవాట్లను అలవాటు చేసుకోండి. కొలెస్ట్రాల్ లేదా ఫలకం ధమనులను అడ్డుకోవడం వల్ల గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడానికి అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన ఆహారం. ఈ పరిస్థితిలో, మీరు గుండె సంబంధిత సమస్యలను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి అనారోగ్యకరమైన ఆహారం లేదా ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాన్ని తినడం మానేయండి. వాటికి బదులుగా పచ్చి ఆకు కూరలు, పప్పులు, తృణధాన్యాలు, తాజా పండ్లు, గుడ్లు వంటి తాజా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినండి. ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి, మీరు రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలి. దీని కోసం ప్రతిరోజూ సైకిల్, ఈత, పరుగు, నడక, శక్తి శిక్షణ చేయండి. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే హాని చేస్తుందని అనుకుంటే అది తప్పు. అది గుండెకు కూడా హాని చేస్తుంది. సిగరెట్ పొగ నుండి విడుదలయ్యే రసాయనాలు ధమనులలో పొరను ఏర్పరుస్తాయి. దీని వలన ధమనులు నిరోధించబడతాయి. ఈ రోజుల్లో, ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతోంది. ఇది ధమనులలో వాపును కలిగిస్తుంది. దీని వలన ధమనులు ఉబ్బడం అలాగే నిరోధించబడతాయి. ఒత్తిడి కారణంగా శరీరంలో 1500 రసాయనాలు విడుదలవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ పరిస్థితిలో, ఒత్తిడిని నియంత్రించడానికి ప్రశాంతంగా ఉండండి. కోపం తెచ్చుకోకండి. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయండి. మీరు మీ హృదయాన్ని ప్రేమిస్తే మద్యానికి దూరంగా ఉండండి. ఆల్కహాల్ కొలెస్ట్రాల్, రక్తపోటు రెండింటినీ పెంచుతుంది. కాబట్టి, గుండె ఆరోగ్యంగా ఉండటానికి దాని వినియోగాన్ని నివారించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి. అధిక బరువు కొలెస్ట్రాల్, అధిక రక్తం, అధిక షుగర్‌కి అతి పెద్ద కారణంగా పరిగణించబడుతుంది. కాబట్టి దానిని అదుపులో ఉంచండి. దీని కోసం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.



## అలాంటివారు ఈ పండు తినకండి!

జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి.అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.



## పడుకునే ముందు వాము నీటిని తాగితే ఇన్ని లాభాలా?



వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వామును నేరుగా కూడా తీసుకోవచ్చు. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వామును కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. పిల్లలకు అరుగుదల సరిగ్గా లేకపోయినా, పెద్దలు గ్యాస్ లాంటి వాటితో బాధ పడుతున్నా వాము ఔషధంగా పనిచేస్తుంది. వాముతో జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM